కేరళ సీఎం కుమార్తెపై ఈడీ కేసు

పీఎంఎల్‌ఏ చట్టం కింద వీణపై కేసు నమోదు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కేరళ సీఎం విజయన్ కుమార్తె వీణా విజయన్‌పై ఈడీ కేసు నమోదు చేసింది. వీణాకు చెందిన ఐటీ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కొచ్చిన్ మినరల్స్ అండ్ రీటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమంగా చెల్లింపులు చేసిందన్న ఆరోపణలతో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

అసలేమిటీ కేసు?

సీఎంఆర్ఎల్ అనే సంస్థ వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి 2018-19 మధ్య రూ.1.72 కోట్లు అక్రమ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ గుర్తించింది. ఎలాంటి సేవలను అందించకుండానే ఎక్సాలాజిక్‌కు సీఎంఆర్ఎల్ ఈ చెల్లింపులు చేసినట్టు ఐటీ శాఖ పేర్కొంది. దీంతో ఎక్సాలాజిక్‌పై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) విచారణ జరిపి అక్రమంగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించింది. ఇది పరిగణనలోకి తీసుకొని ఈడీ కేసు నమోదు చేసింది.

మద్యం పాలసీ కేసు..

నిజాలు కోర్టులోనే కుండ బద్ధలు కొడతారు!

ఆధారాలు కోర్టు ముందు కేజ్రీవాల్ బయటపెడ్తారు

ఢిల్లీ సీఎం సతీమణి సునీత సంచలన ప్రకటన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత బుధవారం సంచలన ప్రకటన చేశారు. మద్యం విధానానికి సంబంధించి నిజానిజాలను తన భర్త కేజ్రీవాల్ గురువారం (మార్చి 28) కోర్టులో బయటపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆమె వీడియో సందేశం విడుదల చేశారు.

వీడియో సందేశంలో ఆమె ఏమన్నారంటే?

'మద్యం కేసుకు సంబంధించి గడిచిన రెండేండ్లలో ఈడీ ఇప్పటివరకు 250 సార్లు సోదాలు జరిపినట్టు కేజ్రీవాల్ చెప్పారు. అయితే, ఇప్పటివరకూ ఎందులోనూ వారికి ఏమీ దొరకలేదు. మా ఇంట్లోనూ ఈడీ సోదాలు జరిపింది. అయితే కేవలం రూ. 73 వేలు మాత్రమే దొరికాయి. మద్యం కేసులో కుంభకోణం జరిగినట్టు చెప్తున్నారు కదా? మరి ఆ డబ్బంతా ఏమయ్యింది? ఈ కేసుకు సంబంధించి అన్ని నిజాలను కోర్టులో బయటపెడతానని కేజ్రీవాల్ నాతో చెప్పారు. లిక్కర్ పాలసీ డబ్బు ఎక్కడుందో ఆయన జడ్జి ముందు చెప్తారు. అందుకు తగిన ఆధారాలు కూడా ఇస్తారు' అని సునీత వీడియోలో వెల్లడించారు.

క్షీణిస్తున్న ఆరోగ్యం

జైలు నుంచి కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేయడాన్ని బీజేపీ నేతలు విమర్శిస్తుండటంపై కూడా సునీత మాట్లాడారు. 'కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణించింది. ఆయన డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కస్టడీ నుంచే నీటి సమస్యను నివారించాలని ఆయన రెండు రోజుల క్రితం మంత్రి ఆతిశీకి లేఖ పంపారు. దీన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పెద్ద సమస్యగా చేస్తున్నది. ఆయనపై కొత్త కేసులు పెడుతున్నది. ఢిల్లీని నాశనం చేయాలని కేంద్రం కోరుకుంటున్నది' అని సునీత మండిపడ్డారు.

మహువాకు ఈడీ నోటీసులు

నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం మరోసారి సమన్లు జారీ చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో భాగంగా గురువారం విచారణకు హాజరుకావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త దర్శన్ హీరానందానికి కూడా సమన్లు పంపింది. కాగా, ప్రశ్నలకు ముడుపుల కేసులో ఇంతకుముందు రెండు సార్లు మహువాకు ఈడీ సమన్లు జారీ చేసినా విచారణకు ఆమె హాజరుకాలేదు. ఇదే కేసులో గత శనివారం సీబీఐ మహువా నివాసాల్లో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. తాజాగా ఈడీ మూడోసారి ఆమెకు సమన్లు జారీ చేసింది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణల కేసులో మహువాపై విచారణ చేపట్టాలని సీబీఐని లోక్‌పాల్ ఆదేశించింది.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?

- జైలు నుంచి పాలన ఉండదన్న ఎల్జీ
- సక్సేనా వ్యాఖ్యలపై ఆప్ మండిపాటు

న్యూఢిల్లీ, మార్చి 27: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించే యోచనలో కేంద్రం ఉన్నదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా చేసిన వ్యాఖ్యల వెనుక మర్మమిదేనని ఆమ్ ఆద్మీ పార్టీ భావిస్తున్నది. మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టు అయినప్పటికీ జైలు నుంచే కేజ్రీవాల్ పాలన కొనసాగిస్తారని ఆప్ ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, 'జైలు నుంచి పాలన జరగదని ఢిల్లీ ప్రజలకు హామీ ఇస్తున్నా' అని ఎల్జీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

ఏ నిబంధన ప్రకారం విధిస్తారు: ఆప్

ఎల్జీ వీకే సక్సేనా వ్యాఖ్యలపై ఆప్ తీవ్రంగా స్పందించింది. ఒకవేళ రాష్ట్రపతి పాలన విధిస్తే.. అది రాజకీయ ప్రతీకారం వల్లనే అనేది స్పష్టమవుతుందని మంత్రి ఆతిశీ పేర్కొన్నారు. ఏ నిబంధనతో రాష్ట్రపతి పాలన విధిస్తారని ప్రశ్నించారు.

ఇక ఈడీ టార్గెట్ పంజాబ్!

మరో ఆప్ పాలిత రాష్ట్రంపై కన్ను..ఇద్దరు అధికారుల ఇండ్లలో సోదాలు

చండీగఢ్, మార్చి 27: ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తర్వాత ఈడీ ఇప్పుడు పంజాబ్‌పై దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. జామతోటల నష్టపరిహారానికి సంబంధించిన కేసులో బుధవారం ఈడీ అధికారులు చండీగఢ్, మొహాలీ, పాటియాలా, ఫిరోజ్‌పూర్, బతిండ ప్రాంతాల్లోని పలువురు అధికారులు, ప్రైవేటు వ్యక్తుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు. పంజాబ్ ఎక్సైజ్ కమిషనర్ వరుణ్ రూజమ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. జామతోటల నష్టపరిహారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వరుణ్ రూజమ్ భార్య సిమ్రత్‌ప్రీత్ కౌర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఫిరోజ్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాజేశ్ ధిమమ్ ఇంట్లోనూ ఈడీ బృందాలు సోదాలు జరిపాయి. రాజేశ్ భార్య జాస్మీన్ కూడా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నిరసన ర్యాలీకి సన్నద్ధమవుతున్న వేళ

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఆప్ సన్నద్ధం అవుతున్న వేళ ఈడీ పంజాబ్‌లో రంగంలోకి దిగడం గమనార్హం.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

- అరెస్టుపై జోక్యం చేసుకునేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ
- ఏప్రిల్ 2లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 27: మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట దక్కలేదు. ఆయన అరెస్టు వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వరణకాంత శర్మ విచారించారు. తన అరెస్టు అక్రమమని, వెంటనే తనను విడుదల చేస్తూ మధ్యంతర ఉపశమనం కల్పించాలని కేజ్రీవాల్ కోర్టును కోరారు. ఆధారాల కోసం తనను అరెస్టు చేయలేదని, కేవలం తనను, తన పార్టీని నిర్వీర్యం చేయడానికే అరెస్టు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల వేళ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. కాగా, కేజ్రీవాల్ పిటిషన్‌పై స్పందించేందుకు తమకు మూడు వారాల సమయం కావాలని ఈడీ తరపున వాదించిన అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు కోర్టును కోరారు. అయితే, కేవలం పిటిషన్‌పై విచారణను వాయిదా వేసేందుకు ఎక్కువ సమయం అడుగుతున్నారని సింఘ్వి అభ్యంతరం తెలిపారు. చివరకు ఏప్రిల్ 2 లోగా స్పందన తెలియజేయాల్సిందిగా ఈడీని కోర్టు ఆదేశిస్తూ ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది. కాగా, కోర్టు ప్రాంగణంలో నిరసనలు తెలిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ హెచ్చరించారు. కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా కోర్టుల్లో నిరసనలకు ఆమ్ ఆద్మీ పార్టీ లీగల్ సెల్ పిలుపు నివ్వడంతోఆయన ఈ విధంగా స్పందించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా కోర్టుల్లో ఎలాంటి నిరసనలు తెలపవద్దని న్యాయవాదులకు సూచించింది.

అమెరికా స్పందనపై భారత్ తీవ్ర అభ్యంతరం

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు విషయమై అమెరికా చేసిన ప్రకటనపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయానికి అమెరికా దౌత్యవేత్త, తాత్కాలిక డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బెర్బెనాను పిలిపించి నిరసన తెలిపింది. దౌత్య సంబంధాల్లో ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, అంతర్గత వ్యవహారాలను గౌరవించాలని, తోటి ప్రజాస్వామ్య దేశాల పట్ల ఈ బాధ్యత మరింత ఎక్కువ ఉంటుందని పేర్కొన్నది.

ఢిల్లీ ఆప్ నేత నివాసంలో ఈడీ సోదాలు

మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీలో ఆప్ నేత దీపక్ సింగ్లాకు చెందిన ప్రాంగణాల్లో ఈడీ బుధవారం సోదాలు చేపట్టింది. కొన్ని ఆర్థిక అక్రమాల ఆరోపణలకు సంబంధించి తనిఖీలు చేపట్టినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, దీపక్ సింగ్లా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విశ్వాస్ నగర్ స్థానం నుంచి ఆప్ అభ్యర్థిగా పోటీచేశారు.

గోవా ఆప్ చీఫ్‌కు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, మార్చి 27: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గోవా ఆప్ కన్వీనర్ అమిత్ పాలేకర్, పలువురు పార్టీ నేతలకు ఈడీ సమన్లు జారీచేసింది. ఈ నెల 28(గురువారం) పనాజీలోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని అందులో కోరినట్టు అధికారిక వర్గాలు బుధవారం వెల్లడించాయి. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో అమిత్ పాలేకర్ ఆప్ సీఎం అభ్యర్థిగా ఉన్నారు. ఆయన ఇటీవల మాట్లాడుతూ గోవా ఎన్నికల ప్రచారం కోసం అక్రమ సొమ్ము పంపించారనే ఆరోపణలకు ఏ ఆధారాలు లేవని, ఎలాంటి దర్యాప్తుకైనా తమ పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మాజీ మంత్రి హరక్‌సింగ్‌కి ఈడీ నోటీసులు

డెహ్రాడూన్, మార్చి 27: ఉత్తరాఖండ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత హరక్ సింగ్ రావత్‌కు ఈడీ తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో ఏప్రిల్ 2న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఈడీ ఫిబ్రవరి 7న హరక్ సింగ్ ప్రాంగణాలపై దాడి చేసి 1.2 కోట్ల నగదు, బంగారం, ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకుంది. ఫిబ్రవరి 29న తమ ముందు హాజరు కావాలని నోటీసులు పంపినప్పటికీ, వేరే పని ఉన్నందున దానిని వాయిదా వేయాలంటూ ఆయన కోరారు. దీంతో ఈడీ తాజాగా మరోసారి నోటీసులు పంపింది.

బీజేపీలో చేరిన ఆప్ ఏకైక లోక్‌సభ ఎంపీ

న్యూఢిల్లీ: న్యాయపరమైన చిక్కులతో ఇబ్బంది పడుతున్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సొంత పార్టీ నుంచి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పంజాబ్‌లో ఆ పార్టీకి గల ఏకైక ఎంపీ సుశీల్ కుమార్ రింకు, ఎమ్మెల్యే శీతల్ అంగురల్ బుధవారం బీజేపీలో చేరారు. సుశీల్ మీడియాతో మాట్లాడుతూ.. జలంధర్ అభివృద్ధి కోసం తాను బీజేపీలో చేరినట్లు తెలిపారు. కాగా, బీజేపీలో చేరితే రూ.20-25 కోట్లు ఇస్తామని తమకు ఆఫర్లు వస్తున్నాయని ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. బీజేపీ ఆపరేషన్‌లోటస్ ప్రారంభించిందని ఆప్ ఆరోపించింది.

ఒక్క ఓటు కోసం 40 కి.మీ. ట్రెక్కింగ్

ఇటానగర్, మార్చి 27: ప్రజాస్వామ్యం గొప్పతనం చాటే వార్త ఇది. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఒక బూత్‌లో ఓటేసేది కేవలం ఒకే ఒక్క ఓటర్. ఆమె ఒక్క ఓటు కోసం ఎన్నికల సిబ్బంది సాహసం చేయాల్సి ఉన్నది. ఆ బూత్‌కు చేరుకోవాలంటే సుమారు 40 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాలి. ఆ గ్రామం పేరు మలోగం. అక్కడ ఉన్న ఓటర్ 44 ఏండ్ల సోకెలా తయాంగ్. ప్రతి ఓటరు తన వాణిని వినిపించాలన్న తమ నిబద్ధతకు ఈ పోలింగ్ బూత్ ఏర్పాటే నిదర్శనమని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

అమరావతి బీజేపీ అభ్యర్థిగా నవనీత్ రాణా

ముంబై, మార్చి 27 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ స్థానం నుంచి నవనీత్ రాణాను బీజేపీ పోటీకి దింపింది. 2019లో ఇదే స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నవనీత్ రాణా లోక్‌సభకు ఎన్నికయ్యారు. అలాగే చిత్రదుర్గ లోక్‌సభ స్థానం నుంచి కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి గోవింద్ కార్జోల్‌ను బీజేపీ బరిలోకి దింపింది. ఇక హర్యానాలోని కర్నాల్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీని బీజేపీ తన అభ్యర్థిగా నిలబెట్టింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా పది మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ విడుదల చేసింది.

బిలీప్ ఘోష్, సుప్రియా శ్రీనేత్‌కు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 27: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కంగనా రనౌత్‌లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాథేలకు ఎన్నికల సంఘం బుధవారం వేర్వేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారి వ్యాఖ్యలు అగౌరవంగా, దురుద్దేశంతో కూడుకుని ఉన్నాయని ఈసీ వ్యాఖ్యానించింది. ప్రాథమిక ఆధారాలను బట్టి వీరిద్దరూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని స్పష్టమవుతున్నదని పేర్కొంది. తాము పంపిన షోకాజ్ నోటీసులకు ఈ నెల 29 సాయంత్రం లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు గౌరవంతో, హుందాగా వ్యవహరించాలని ఈసీ ఈ సందర్భంగా సూచించింది. ఎన్నికల సందర్భంగా ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం కుమార్తెనని మమతా బెనర్జీ చెపుతున్నారని, ఇంతకీ ఆమె తండ్రి ఎవరో స్పష్టం చేయాలని దిలీప్ ఘోష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

కర్ణాటక కాంగ్రెస్‌లో టికెట్ల కుంపటి

- కోలార్‌లో రెండుగా చీలిన పార్టీ
- లోక్‌సభ టికెట్‌పై నేతల సిగపట్లు
- మంత్రి మునియప్ప అల్లుడికి టికెట్ ఇవ్వొద్దని వ్యతిరేక వర్గం అల్టిమేటం
- తమ పదవులకు రాజీనామాలు చేస్తామని ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీల హెచ్చరిక
- వ్యతిరేకిస్తున్న వారిలో సుధాకర్

బెంగళూరు, మార్చి 27: కర్ణాటక కాంగ్రెస్‌లో లోక్‌సభ టికెట్ల పంచాయితీ కుంపటి రేపింది. కోలార్ నుంచి రాష్ట్ర మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు చిక్కా పెద్దన్నకు టికెట్ దక్కనుందనే ప్రచారం నేపథ్యంలో.. ఆ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిరంగంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పెద్దన్నకు ఎంపీ టికెట్ ఇస్తే తమ పదవులకు రాజీనామా చేస్తామని ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు హెచ్చరించారు. వీరిలో కోలార్, మలూర్, చింతమణి ఎమ్మెల్యేలు వరుసగా జీ మంజునాథ్, కేవై నంజేగౌడ, ఎంసీ సుధాకర్ ఉన్నారు. వీరి గ్రూపునకు ఎమ్మెల్సీలు అనిల్ కుమార్, నజీర్ అహ్మద్ కూడా తోడయ్యారు. సుధాకర్ సీఎం సిద్ధరామయ్య క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.

మళ్లీ ఆ కుటుంబానికే అంటే ఎలా..

కోలార్‌లో ఎస్సీ లెఫ్ట్ సెక్షన్‌కు చెందిన చిక్కా పెద్దన్నకు టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వీళ్లంతా.. ఎస్సీ రైట్ సెక్షన్ వ్యక్తికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నంజేగౌడ మాట్లాడుతూ మునియప్ప ఇప్పటికే మంత్రిగా, ఆయన కుమార్తె ఎమ్మెల్యేగా ఉన్నారని, ఈ నేపథ్యంలో మళ్లీ వారి కుటుంబానికి చెందిన వ్యక్తికే ఎంపీ టికెట్ ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. జిల్లాకు చెందిన బంగారపేట ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ్‌స్వామి కూడా ఎస్సీ రైట్ అభ్యర్థికే కోలార్ ఎంపీ టికెట్ ఇవ్వాలన్నారు. టికెట్ విషయంలో పార్టీ నిర్ణయం తీసుకొన్న తర్వాత తన కార్యాచరణపై నిర్ణయం తీసుకొంటానని ఆయన పేర్కొన్నారు.

నేను సీఎం కావడంపై కాంగ్రెస్‌దే నిర్ణయం: డీకే

కర్ణాటకలో నాయకత్వ మార్పిడి అంశాన్ని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి తెరపైకి తీసుకొచ్చారు. భవిష్యత్తులో తనను ముఖ్యమంత్రిని చేయడంపై కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. ఉత్తర కన్నడ జిల్లాలోని గోకర్ణలో బుధవారం ఆయన ఓ దేవాలయాన్ని సందర్శించారు. శివకుమార్ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ ఆ ఆలయ పూజారి ప్రార్థన చేశారు. అనంతరం శివకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఆ పూజారి తన కోరికను వ్యక్తం చేశారని, ఇందులో తప్పేమున్నదని ప్రశ్నించారు. 'డిప్యూటీ సీఎంగా, పీసీసీ అధ్యక్షునిగా పనిచేస్తున్న నేను సీఎం కావాలని ఇలాంటి పూజారులు, నా మద్దతుదారులతో పాటు ఎంతో మంది ప్రజలు వాంఛిస్తున్నారు. అలా కోరుకోవద్దని వారిని ఆపగలమా? ఏదేమైనా భవిష్యత్తులో నేను సీఎం కావడంపై నిర్ణయం తీసుకోవాల్సింది మా పార్టీయే. ప్రస్తుతానికి మేమంతా సీఎం సిద్ధరామయ్య కింద పనిచేస్తున్నాం. ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత పురోగమించాలన్నదే మా ఆకాంక్ష' అని శివకుమార్ స్పష్టం చేశారు.

కిచిడీ చోర్‌కు టికెట్టా?

శివసేన (యూబీటీ)పై కాంగ్రెస్ ఫైర్

మహావికాస్ అఘాడీలో విభేదాలు

ముంబై, మార్చి 27: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమిలో విభేదాలు వీధికెక్కాయి. ఒక పక్క ఆ కూటమిలో భాగస్వామి అయిన వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ) సొంతంగా పోటీ చేస్తున్నట్టు ప్రకటించగా, మరో పక్క చర్చలు జరుగుతుండగానే శివసేవ (యూబీటీ) తన పార్టీ అభ్యర్థుల మొదటి లిస్టును విడుదల చేసింది. ముంబైలోని నాలుగు సీట్లకు శివసేన (యూబీటీ) తన అభ్యర్థులను ప్రకటించడం పట్ల కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముంబై వాయువ్య సీటును కేటాయించిన అమోల్ కృతికర్‌ను 'కిచిడీ చోర్' అంటూ విమర్శించారు. పొత్తు ధర్మాన్ని శివసేన విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'శివసేన ఒక కిచిడీ చోర్‌కు టిక్కెట్‌ను కేటాయించింది. అలాంటి కిచిడీ చోర్ అభ్యర్థులకు మేము ఎంతమాత్రం పనిచేయబోం' అని ఆయన తెగేసి చెప్పారు. కాగా, ఎంపీ గజానన్ కృతికర్ కుమారుడైన అమోల్ కృతికర్ కొవిడ్-19 సమయంలో వలస కూలీలకు కిచిడీ పంపిణీలో అక్రమాలకు పాల్పడిన కేసులో ఆయనకు ఈడీ సమన్లు జారీ చేసింది.

అభ్యర్థులను ప్రకటించిన వీబీఏ

మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడి కూటమికి కూటమిలో మరో భాగస్వామి అయిన వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ) మిగిలిన పార్టీలకు షాకిస్తూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగానే పోటీ చేస్తున్నట్టు బుధవారం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ ఐదుగురు అభ్యర్థుల మొదటి లిస్టును సైతం విడుదల చేశారు.

స్థానిక మత పెద్ద సీఏఏ 'అర్హత పత్రం' ఇవ్వొచ్చు!

కేంద్ర హోంశాఖ హెల్ప్‌లైన్ సమాధానం వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 27: ఒక దరఖాస్తుదారుడి మతాన్ని ధ్రువీకరించేందుకు పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)-2019 కింద మత పెద్ద కూడా 'అర్హత పత్రాన్ని' జారీ చేయవచ్చని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పేర్కొన్నది. ఈ మేరకు హోంశాఖ ఏర్పాటు చేసిన సీఏఏ హెల్ప్‌లైన్ నుంచి సమాధానం వచ్చిందని ది హిందూ తాజా కథనంలో పేర్కొన్నది. కాగా, అఫిడవిట్, ఇతర పత్రాలతో సహా తప్పనిసరిగా సమర్పించాల్సిన డాక్యుమెంట్‌గా ఈ అర్హత సర్టిఫికెట్ ఉన్నది. దీన్ని కూడా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్థానికంగా ప్రజల్లో విశ్వాసం ఉన్న ఏ మత సంస్థ అయినా ఈ సర్టిఫికెట్‌ను జారీచేయవచ్చనే సమాధానం సీఏఏనుంచి వచ్చిందని హిందూ తెలిపింది.

ఎన్ఐఏ చీఫ్‌గా సదానంద్ వసంత్

26/11 హీరోకి కీలక పదవి

న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చీఫ్‌గా ఎంపికైన మహారాష్ట్ర తీవ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్) చీఫ్ సదానంద వసంత్ నియమితులయ్యారు. 2026 డిసెంబర్ 31 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఎన్ఐఏ ప్రస్తుత చీఫ్ దినకర్ గుప్తా పదవీకాలం మార్చి 31తో ముగియనున్నది. 26/11 ముంబై దాడుల సమయంలో ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడిన సదానంద్‌కు రాష్ట్రపతి పోలీస్ మెడల్ కూడా దక్కింది. రాజస్థాన్ క్యాడర్ 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్‌కుమార్ 'బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చ్, డెవలప్‌మెంట్'కు డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కు యూపీకి చెందిన ఐపీఎస్ అధికారి పీయూష్ ఆనంద్‌ను కొత్త చీఫ్‌గా నియమించారు. అలాగే ఎస్‌పీజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా కేరళ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఎస్ సురేశ్ నియమితులయ్యారు.



నోట్ల కట్టలపై నిద్ర

అసోం రాష్ట్రానికి చెందిన యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత కరెన్సీ నోట్లపై నిద్రిస్తున్న ఫొటో ఒకటి వైరలైంది. లోక్‌సభ ఎన్నికల వేళ ఇది రాజకీయ దుమారానికి దారి తీసింది. అతడిని సస్పెండ్ చేసినట్లు పార్టీ ప్రకటించింది. యూపీపీఎల్‌కు చెందిన విలేజ్ కౌన్సిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడైన బెంజమిన్ బాసుమతరీ ఒంటిపై కేవలం టవల్ మాత్రమే ధరించి తన పరుపుపై మొత్తం 500 నోట్లను పరిచి వాటిపై పడుకున్న ఫొటో ఒకటి బయటకు వచ్చింది. అయితే ఈ ఫొటో ఎప్పుడో పాతదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే దీన్ని ఇప్పుడు కొందరు పనిగట్టుకుని వైరల్ చేస్తున్నారని అతని సన్నిహితులు తెలిపారు. బెంజమిన్ బాసుమతరీని పార్టీ సస్పెండ్ చేయటమే గాక అతడి పదవి కూడా ఊడిందని చెప్పుకొచ్చారు.

హెచ్-1బీ నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ: హెచ్-1బీ దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ కొన్ని నిబంధనల్లో మార్పులు చేసింది. హెచ్-1బీ, హెచ్-1బీ1 ఫారం ఐ-129 పిటిషన్ల ఫైలింగ్ లొకేషన్‌ను సవరించింది.